చలో కలెక్టరేట్ ర్యాలీకి తరలిన బిఎన్ఆర్‌కెస్ కార్మికులు



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

భవన నిర్మాణ రంగ కార్మికుల 13 రకాల డిమాండ్ లు అమలు కోసం రాష్ట్ర అధ్యక్షులు కామల ఐలన్న పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సోమవారం నాడు భవన నిర్మాణ రంగ సంఘం ఎల్లారెడ్డి మండల కమిటీ అధ్యక్షులు మరులు సాయిబాబా ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మండలంలోని కార్మికులంతా సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌కు బైక్ ర్యాలీతో తరలివెళ్లారు. కార్మికుల డిమాండ్లు పరిష్కరించి అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సాయిలు,ప్రధాన కార్యదర్శి కాంతారావు, కార్యదర్శి దావీదు, కోశాధికారి దుర్గా సింగ్, లక్ష్మణ్,చందు, నాగరాజు,సాయిలు, బాలరాజు, హనుమంతు,రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తండ్రిని చంపిన తనయుడు



నవతెలంగాణ-జుక్కల్

ఆస్తి తన పేరు మీద రాయలేదనే కోపంతో కన్నతండ్రిని హత్య చేశాడో కొడుకు. ఈ దారుణ ఘటన కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం సోపూర్‌లో సోమవారం వెలుగుజూసింది. ఎస్ఐ సత్యనారాయణ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లాలప్ప(75)కు ఏడుగురు కూతుర్లు, ఇద్దరు కొడుకులు. ఐదు ఎకరాల భూమి ఉండగా.. తనకు చెందిన ఆస్తిని ఇద్దరు కొడుకులకు చెరి సమానంగా పంచారు. అయితే చిన్న కొడుకు సుభాశ్ డ్రైవర్‌గా పని చేస్తుండగా గతంలో ఒక ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేయగా.. అప్పులు చేసి అమ్మేశాడు. దీంతో మరో ఎకరన్నర భూమిని లాలప్ప ఆయన చిన్న కోడలు పేరు మీద రిజిస్ట్రేషన్ చేశాడు.

వివరాలు మెయిన్‌లో..



'ప్రయివేటు' దోపిడీకి రంగం సిద్ధం

- యూనిఫాం, పుస్తకాలు, స్టేషనరీ మొదలు బ్యాగ్‌లు సైతం స్కూళ్లోనే విక్రయం
- యాజమాన్యం ఆధీనంలో అమ్మకాలు
- వారు చెప్పిందే ధర
- విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్ల
- ఫిర్యాదులు అందట్లేవంటూ విద్యాశాఖ దాటవేత ధోరణి
- రేపటి నుంచి స్కూళ్లు పునఃప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న వేళ.. 'ప్రయివేటు'లో దోపిడీకి రంగం సిద్ధమైంది. చదువు సారెడు.. బల్పాలు దోషెడు అన్న చందంగా పలు ప్రయివేటు కార్పొరేట్ పాఠశాలలు వ్యవహరిస్తున్నట్టు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులకు అవసరమయ్యే బ్యాగుతో మొదలు యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్స్, స్టేషనరీ సర్వం పలు ప్రయివేటు పాఠశాలల్లోనే విక్రయాలు చేపడుతున్నట్టు సమాచారం. వారు చెప్పిందే ధరగా ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. బయటి కంటే ఎక్కువ ధర వసూలు చేస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు చిల్లు పడుతుంది. ఇంత జరుగుతున్నా.. విద్యాశాఖ చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఫిర్యాదు చేస్తే ఎక్కడ తమ పిల్లలను టార్గెట్ చేస్తారో అనే భయంతో తల్లిదండ్రులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకొని ఫిర్యాదులు అందట్లేదనే సాకుతో విద్యాశాఖ అధికారులు దాటవేత ధోరణి అవలంభిస్తున్నారు.

పలు ప్రయివేటు విద్యాసంస్థల స్టేషనరీ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా విరాజిల్లుతుంది. ప్రైవేటు విద్యాసంస్థల్లో పుస్తకాలు, స్టేషనరీ విక్రయాలు చేపట్టొద్దని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ అమలు కావడం లేదు. ప్రవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఎమ్మార్పీ ధరలు గాలికి వదిలి తమ ట్యాక్స్‌ను కలుపుకొని అత్యధిక ధరకు పుస్తకాలు స్టేషనరీ సామగ్రి అమ్ముతున్నా పట్టించుకునే నాథుడే లేదు. ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థులు వారికి అవసరమైన పుస్తకాలు యూనిఫామ్‌తో పాటు అన్ని రకాల స్టేషనరీ సామాగ్రి వారి వద్దనే కొనుగోలు చేయాలనే నిబంధన విధిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాల ఫీజులపై ప్రభుత్వం ఎలాగూ నియంత్రణ విధించలేని పరిస్థితిలో ఉండగా కనీసం పాఠశాలలో స్టేషనరీ అమ్మకాలను కూడా నిరోధించలేక పోతుంది

పుస్తకాలు కొనాలని ముందస్తు మెసేజ్‌లు

జూన్ 12వ తేదీన పాఠశాల లు ప్రారంభించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉండగా కొన్ని విద్యాసంస్థలు ముందస్తుగా పదవ తేదీనే విద్యార్థులకు రావాలని మెసేజ్ లు పెట్టారు. అంతేగాక పాఠశాలలో పుస్తకాలు స్టేషనరీ సామాగ్రి అయిపోతాయని తొందరపడి కొనుక్కోవాలని ముందు వచ్చిన వారికే పుస్తకాలు అంటూ ఎస్ఎంఎస్ లు పంపి ఫోన్లు చేయడంతో తల్లిదండ్రులు దిక్కుతోచని పరిస్థితులలో అప్పుచేసి మరి పాఠశాలకు పరుగులు తీస్తున్నారు.

ఒక్కో పాఠశాలలో ఒక్కో సిలబస్

ప్రైమరీ సెక్షన్ వరకు ఒక్కో స్కూల్ ఒక్కో సిలబస్ అమలు చేస్తుండటంతో పుస్తకాలు బయట కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ అకాడమీ పుస్తకాలు తక్కువ ధరకు వస్తుండగా.. ప్రైవేటు విద్యాసంస్థల ప్రత్యేక సిలబస్ పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఆ పుస్తకాలపై ఎమ్మార్పీ ధరలు కూడా ఉండడం లేదు. వారు చెప్పింది ధర. తల్లిదండ్రులు ఇచ్చిందే లెక్క అంటూ పుస్తకాలు నోటు పుస్తకాలు పెన్సిళ్లు రబ్బరు కంపాస్ లు స్కేల్ పెన్నులు ఇతర స్టేషన్ సామాగ్రి తమకు ఇష్టం వచ్చిన ధరకు అమ్ముకుంటున్నారు. ఇదేమిటి అని అడిగే నాధుడే లేదు. కొన్ని పాఠశాలలో 8, 9, 10 తరగతి కి సంబంధించిన ఐఐటీ సిలబస్ పుస్తకాలంటూ వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. అలా పుస్తకాలు కొనుగోలు చేస్తే మూడు సంవత్సరాలు తమ పాఠశాలలో చదువుతారని యాజమాన్యాలు ఎత్తుగడ వేశాయి.

బ్యాగులు సైతం.. స్కూళ్లల్లోనే

జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు గతంలో పుస్తకాలు, నోట్‌బుక్కులు విక్రయించేవారు. ప్రస్తుతం ఒక అడుగు ముందుకేసి బ్యాగులు, యూనిఫాం, స్టేషనరీ, బ్యాడ్జీలు, బూట్లు సర్వం స్కూళ్లల్లోనే విక్రయాలు చేపడుతున్నారు. ఒక పాఠశాలకు సంబంధించిన వస్తువులు ఇంకో పాఠశాలకు పనికిరావు. ఇదే అదునుగా ప్రవేట్ పాఠశాల యాజమాన్యాలు తమ ఆధీనంలోనే అన్ని రకాల యూనిఫామ్ సామగ్రి విక్రయిస్తూ అధిక ధరలకు దండుకుంటున్నారు. యూనిఫామ్ బూట్లు టైలు ఐడి కార్డులు అన్ని కలిపి అవి ఒక పది వేల నుంచి 20 వేల వరకు వసూలు చేస్తున్నారు.

బుక్‌హౌస్‌లతో స్కూళ్ల టైఅప్ అయి దోపిడీ

ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్



జీవోలు 1, 2, 41, 91 ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో పుస్తకాలు, టై , యూనిఫామ్స్, అమ్మడం, క్యాపిటేషన్ల పేరిట డొనేషన్ల పేరిట అధిక ఫీజులు వసూలు చేయొద్దని నిబంధనలు ఉన్నా పలు ప్రయివేటు స్కూళ్లు పట్టించుకో వడం లేదు. ప్రతి పాఠశాల పెంచిన ఫీజులను నోటీసు బోర్డులో పొందుపరచాలనే నిబంధన ఉన్నా ఏ ఒక్క పాఠశాల కూడా అమలు చేయడం లేదు. కొన్ని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు పలు బుక్ హౌస్‌లతో టై అప్ అయ్యి అవసరానికి మించి పుస్తకాలను విద్యార్థుల తల్లిదండ్రులతో కొనుగోలు చేయిస్తూ విద్యార్థులతో అధిక బరువును మోయించడం సబబు కాదు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పాఠశాలల్లో పుస్తకాలు పెట్టుకోవడం కోసం ర్యాక్స్‌ను ఉపయోగించాలి. వెంటనే జిల్లా విద్యాధికారి అన్ని పాఠశాలలకు నోటీసులు పంపించాలి.



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

మెడికల్ కాలేజీలో నీటి కొరత తీర్చాలి

- కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచన

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మెడికల్ కళాశాలను సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ల్యాబ్‌ను పరిశీలించారు. గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలు కొరత ఉందని అధికారులు తెలపడంతో కావలసిన పుస్తకాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కళాశాలలో తాగు నీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించాలని తెలిపారు. మెడికల్ కళాశాల ఆవరణలో ఉద్యానవనం ఏర్పాటు కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఉద్యానవనంలో ఔషధ మొక్కలు నాటాలని అధికారులను కోరారు. ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ సుజాత, అధ్యాపకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జంతురక్షణ కేంద్రం పరిశీలన

కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లిలో జంతువుల రక్షణ కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. కామారెడ్డి మున్సిపల్ ఆధ్వర్యంలో జంతువులకు రక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుక్కలకు ఇక్కడ శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు అధికారులు తెలిపారు. కుక్కల బారీ నుంచి ప్రజలను రక్షించడానికి జంతువుల రక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సింహరావ్, అధికారులు సంజయ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సాగు.. సాగట్లే



- మేఘం కమ్ముకుంటున్నా.. చినుక జాడ లేదు
- వరుణుడి కోసం రైతులు ఎదురు చూపు
- వర్నిలో గతేడాది ఇదే సమయానికి 80 శాతం నాట్లు పూర్తి

నవతెలంగాణ-వర్ని

పొద్దంత ఎండ, ఉక్కపోత. మధ్యాహ్నం నాలుగు గంటల తర్వాత మబ్బులు పడుతు చల్లగాలి వీస్తున్నా.. వర్షం మాత్రం కురవడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా సకాలంలో వర్షాలు లేక సాగు పనులు ముందుకు సాగడంలేదు. దీంతో వరుణుడి కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

రాష్ట్రంలో వర్షాకాలం సీజన్ వచ్చిందంటే నెల రోజులుగా ముందుగా వరి నాట్లు వేసే ప్రాంతం బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలం. నిజాంసాగర్ ఆయటకట్టు ప్రాంతం కావడంతో ఇక్కడ ఎక్కువగా వరి పంటనే సాగు చేస్తుంటారు. ప్రతి ఏటా ఇక్కడ జూన్ మొదటి వారంలోగానే 80 శాతం వరకు రైతులు నాట్లు ముగించేవారు. మృగశిర కార్తీలో ఎక్కువ వర్షాలు సతం కురిసేవి. ప్రసుతం జూన్ రెండవ వారానికి వచ్చినా.. ఇంక ఎండలు ఉండటంతో రైతుల నాట్లు వేసేందుకు వెనుకాముందు అవుతున్నారు.

భారీ వర్షాలు కురకవకపోవడంతో ఆదిలోనే పంటకు నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని రైతులు ఆచితూచి అడుగువేస్తున్నారు. పలువురు వరి నారు వేసుకోగా.. వర్షాలు లేక నారు రంగుమారుతున్నట్టు ఆవేదన చెదుతున్నారు. నిజాంసాగర్ నీటిని వదలినా వర్ని ప్రాంతానికి చేరే వవరకు వారం రోజులు అవుతుంది. నిజాంసాగర్ అయకట్టు కింద కొన్ని గ్రామాలే ఉండగా.. మిగతా రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.

ఎత్తిపోతున్న బోరుబావులు

జూన్ రెండోవారానికి వచ్చినా భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వర్షాలు సైతం కురవకపోవడంతో బోరుబావుల్లో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. పలువురి రైతుల బోర్లు ఎత్తిపోతుండగా.. మరికొంత మంది రైతులు ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకుంటున్నారు. వరి నాట్లు మడుల వారీగా రోజుకు రెండు నుంచి మూడు ఎకరాలు నాట్లు వేస్తున్నారు. దీంతో కూలీల సంఖ్య పెరిగి అధికంగా డబ్బులు వెచ్చించాల్సి వస్తుంది. ప్రారంభంలో భారీ వర్షాలు కురిస్తేనే సాగు పనులు జోరుగా సాగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

- రెండున్నర నెలల తర్వాత పునఃప్రారంభం
- దరఖాస్తు చేసేందుకు తరలివచ్చిన బాధితులు





నిజామాబాద్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ.. కామారెడ్డిలో స్వీకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మార్చి 20వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రజావాణిని తాత్కాలికంగా నిలిపివేయగా.. తాజాగా పోలింగ్ పూర్తయి ఫలితాలు వచ్చి ఎన్నికల కోడ్ ముగియడంతో తిరిగి సోమవారం ప్రజావాణిని పునఃప్రారంభించారు. అయితే ఇరు జిల్లాల్లో ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువల వచ్చాయి. దాదాపు రెండు నెలల 20 రోజుల తర్వాత ప్రజావాణిని తిరిగి ప్రారంభించడంతో తమ సమస్యల పరిష్కారం కోసం పలువురు బాధితులు పెద్దఎత్తున కలెక్టరేట్‌లకు తరలివచ్చారు.

నిజామాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 135 ఫిర్యాదులు అందాయి. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులో ఉండడంతో తాత్కాలికంగా వాయిదా వేసిన ప్రజావాణిని జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం నుంచి మళ్ళీ పునరుద్ధరింపజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

జాప్యం లేకుండా పరిష్కరించాలి

ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను జాప్యం లేకుండా పరిష్కరించాలని కామారెడ్డి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డిఆర్ డిఓ చందర్, కలెక్టరేట్ ఏ.ఓ.లతో కలిసి ప్రజావాణి నిర్వహించి వినతులు స్వీకరించారు. ప్రజల నుండి 50 వినతులను స్వీకరించారు. ఇందులో రెవెన్యూ 33, వ్యవసాయం 5 సివిల్ సప్లై 2, మునిసిపల్04, సర్వే ల్యాండ్ 2, విద్యాశాఖ 1, గ్రామ పంచాయతి 02, గిరిజన సంక్షేమ శాఖకు ఒకటి చొప్పున వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణిలో తమ సమస్యలు చెబితే వెంటనే పరిష్కారమవు తాయని దృఢనమ్మకంతో ఎంతో బాధ, ఆవేదనతో వివిధ ప్రాంతాల నుండి ఫిర్యాదీదారులు వస్తారని, వారిని ఆప్యాయతతో పలకరించి సమస్యలను సావధానంగా విని పరిష్కరించాలని, లేదా పరిష్కార మార్గాలు చూపాలని అన్నారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టిపెట్టారని అన్నారు. ఇక్కడ పరిష్కారం కాకపోతే ప్రజాభవన్‌కు వెళుతున్నారని, ఆ పరిస్థితులకు దారితీయకుండా ఫిర్యాదీదారుల వినతులను సమగ్రంగా పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు.

హైదరాబాద్ ఫిర్యాదులు జిల్లాకు బదిలీ

ప్రతి మంగళ, శుక్రవారాల్లో హైదరాబాద్ లోని ప్రగతి భవన్‌లో నిర్వహించే ప్రజావాణిలో జిల్లాకు సంబంధించి 391 వినతులు అందగా ముఖమంత్రి (సీఎంవో) కార్యాలయం నుండి అట్టి వినతులను జిల్లాకు పంపారని అదనపు కలెక్టర్ తెలిపారు. వాటిని సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యతనిచ్చి ప్రత్యేకశ్రద్ధతో పరిశీలించి పరిష్కరించాలన్నారు. దరఖాస్తు తిరస్కరణ లేదా పరిష్కరించక పోవడానికి సాహేతుకమైన కారణాలుంటే ఫిర్యాదీదారుకు సకాలంలో తెలపాలని, ఎట్టి పరిస్థితులలో తమ వద్ద అనవసరంగా పెండింగ్ లో పెట్టుకోరాదని స్పష్టం చేశారు. పరిష్కరించిన వినతులను prajavanisno@gmail.comలో వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు రాజారామ్, రాజు, దయానంద్, వరదా రెడ్డి, భాగ్యలక్ష్మి, శ్రీధర్, శ్రీనివాస్, బావయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈసారి ప్రణాళికతో ధాన్యం సేకరించాలి

- ఖరీఫ్ ధాన్యం సేకరణపై ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించండి
- అధికారులతో సమీక్షలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

వచ్చే ఖరీఫ్ సీజనులో ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించవలసినదిగా కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణా రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో కామారెడ్డి నియోజక వర్గంలో పూర్తైన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ, వచ్చే 2024-25 ఖరీఫ్ సీజనుకుముందస్తుగా చేపట్టవలసిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో కలిసి సమీక్షిస్తూ అధికారులకు, మిల్లర్లకు దిశా నిర్దేశం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్ మిల్లుల వద్ద వివిధ కారణాలతో తరుగు తీస్తున్నారని, ఇది తగదని ఒక పద్ధతి ప్రకారం వెళ్లాలని హెచ్చరించారు. అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, మిల్లర్లు సమన్వయంతో టీమ్ వర్క్ గా పని చేయాలన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని త్వరగా విక్రయించా లనే ఆలోచనతో నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా తెచ్చిన తేమ ఉందని, తాళ్లు, పొల్లు ఉందని తరుగు తీసినట్లు మా దృష్టికి వచ్చిందని, వచ్చే సీజనులో ఇది పునరావృత్తం కారాదని అన్నారు. రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, ప్రతి కేంద్రంలో అవసరమైన ప్యాడి క్లీనర్లు, డ్రయ్యింగ్ మిషన్లు, , జాలి మిషన్లు అందుబాటులో ఉంచాలన్నారు. నాలుగు మాసాలలో ఖరీఫ్ పంట చేతికి వస్తున్నందున ప్రస్తుతం మిల్లులలో ఉన్న ధాన్యాన్ని ఎఫ్ సి ఐ అధికారులు వ్యాగన్ల ద్వారా త్వరగా తరలించాలని అప్పుడే ఖరీఫ్ ధాన్యాన్ని అన్ లోడింగ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎఫ్.సి.ఐ. అధికారులు గోదాములలో ఎక్కువ స్థలం కేటాయించి వ్యాగన్ల ద్వారా సి.ఎం.ఆర్. రైస్ ను త్వరితగతిన తరలించుటకు లేఖ రాయాల్సిందిగా అధికారులకు సూచించారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ రబీ సీజనులో జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 3,27,631 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కామారెడ్డి నియోజక వర్గంలో 85 కేంద్రాల ద్వారా 93 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. అకాల వర్షాలు, పాత సీజన్లకు సంబంధించి రైస్ మిల్లులల్లో ధాన్యం పేరుకుపోయి అన్ లోడ్ చేయడానికి స్థలం లేకపోవడం వల్ల కాస్త ఇబ్బందులు పడ్డ రైస్ మిల్లులు ఓపెన్ ప్లేస్‌లలో ధాన్యం దించుకున్నారన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రాలలో రైతు వారీగా ఎంత ధాన్యం ఉంది, ఎన్ని లారీలు అవసరమో మానిటరింగ్ చేస్తూ కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా మేనేజర్ నిత్యానందం, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, ఎఫ్.సి.ఐ. డివిజనల్ మేనేజర్ ప్రకాష్, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, జిల సహకార అధికారి శ్రీనివాస్, డిసిఎంఎస్ అధికారి రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు లింగం పాల్గొన్నారు.

పంచాయతీ భూములు గుర్తించండి

- భగీరథ కనెక్షన్‌పై ఇంటింటి సర్వే చేయండి
- కార్యదర్శుల సమావేశంలో డీపీవో శ్రీనివాస్



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామపంచాయతీ భూములను గుర్తించాలని వాటి నివేదికను సకాలంలో అందించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ కార్యదర్శులకు సూచించారు. సోమవారం లింగంపేట మండలం కేంద్రంలోని రైతు వేదికలో లింగంపేట్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, గాంధారి మండలాలకు చెందిన కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ భూములను ఆస్తులను గుర్తించి వాటి నివేదికను మండల పరిషత్ అధికారులకు అందజేయాలని సూచించారు.

అదేవిధంగా మిషన్ భగీరథ ద్వారా నల్ల కనెక్షన్‌లు ఎన్ని ఇండ్లకు ఉన్నాయో సర్వే చేపట్టాలని, అదే విధంగా ప్రతి ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఉందా.. నీళ్లు వస్తున్నాయా అడిగి తెలుసుకోవాలని అన్నారు. వారం రోజులు సర్వే నిర్వహించి నివేదిక అందించాలన్నారు. సమావేశంలో ఎల్లారెడ్డి డీఎల్‌పీ సురేందర్ ఎంపీఓలు నాలుగు మండలాల కార్యదర్శులు తదితరులున్నారు.

నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు అంబిక సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్ పాల్గొని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శంకర్ ముదిరాజ్, బొబ్బ నరసింహ, లవంగ రాజు, అశోక్ ఆర్సపల్లి, షేక్ ఫిరోజ్, గంగా సాగర్, ఇప్పులపల్లి విష్ణు, రాజేశ్వర్, హరీష్, రాజేశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

బోరు బావికి భూమిపూజ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎంపీపీ నిధులతో 'బోరు బావి'కి భూమిపూజ చేసి పనులను ప్రారంభిం చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎంపీపీ భర్త సామ వెంకట్ రెడ్డి, పాఠశాల ప్రధానో పాధ్యాయులు శ్రీనివాస్, కవిత, అంగన్ వాడి టీచర్ అమినా బేగం తదితరులు ఉన్నారు.



బోరుబావి పనులను ప్రారంభించిన పలువురు

వ్యాయామ ఉపాధ్యాయులను అప్‌గ్రేడేషన్ చేసినందుకు కృతజ్ఞతలు



డీఈవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వ్యాయామ ఉపాధ్యాయులకు అప్‌గ్రేడేషన్ అయిన సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గా ప్రసాద్‌ను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం వారు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు టి. విద్యాసాగర్ రెడ్డి, కార్యదర్శి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా వ్యాయామ ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటంవల్ల వ్యాయమ ఉపాధ్యాయుల అప్ గ్రేడేషన్ సమస్యకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి నిజామబాద్ జిల్లా వ్యాయమ ఉపాధ్యాయ సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత కొంతకాలంగా అపరిష్కృతంగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుల అప్ గ్రేడేషన్ సమస్య తీరిందని, పాఠశాలలో ఉన్న విద్యార్థుల క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం వ్యాయామ ఉపాధ్యాయుల అప్ గ్రేడ్ జరిగిందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం జిల్లా పరిషత్ పాఠశాలలు 79, ప్రభుత్వ పాఠశాలలో 9 మొత్తం 88 పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు అప్‌గ్రేడ్ చేశారని, జిల్లాకు 88 పోస్టులు మంజూరు చేశారని అన్నారు. దీనికి సహకరించిన రాష్ట్ర సంఘా గౌరవ అధ్యక్షులు డాక్టర్ సోమేశ్వర్ రావుకు, అధ్యక్షులు డాక్టర్ రాఘవరెడ్డి కి ప్రధాన కార్యదర్శులు కృష్ణమూర్తి గౌడ్‌కి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల అందరి తరపున ధన్యవాదాలు తెలిపారు. జిల్లా వాయ్యమా ఉపాధ్యాయ సంఘం చైర్మన్ ఈగ సంజీవ్ రెడ్డికి, జిల్లా సంగం మాజీ అధ్యక్షులు కే.అనిల్ కి, రిటైర్డ్ వ్యాయమ ఉపాధయ్యులకు, ఈ సమస్య పరిష్కారానికి తమవంతు సహకరించిన వివిధ ఉపాధ్యాయ సంఘాలకు, పండిత వాయ్యమా ఉపాధ్యాయ జాయింట్ యాక్షన్ కమిటీ, వీరితో పాటు ఈ సమస్యను పరిష్కారానికి సహాయపడిన పత్రికా మిత్రులకు, అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ముందస్తు ఒప్పందం ద్వారా విత్తనాల కొరత

- ఏఈవో



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈవో

నవతెలంగాణ-బాల్కొండ

విత్తనాల కొరతకు రైతులే కారణమవుతారని వ్యవసాయ విస్తరణ అధికారి రేష్మ అన్నారు. రైతులు దళారుల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ ముడి సరుకుల కొనుగోలు సమయం లో రైతులు జాగ్రత్తలు పాటించాలని, నేలలో సరైన తేమ ఉన్నప్పుడే పంట విత్తు కోవాలని తెలిపారు. గ్రామ స్థాయిలో లూజుగా విత్తనాలు అమ్మే వారి పై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. సోమవారం బాల్కొండ క్లస్టర్ పరిధిలోని నాగపూర్ లో రైతులకు ఖరీఫ్ సాగు సమయాత్తం పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రేష్మ మాట్లాడుతూ.. రబీ పంట కోతలు చివరి దశకు చేరుకోవడంతో రైతులు ఖరీఫ్ పంట కొరకు కావాల్సిన తమకు నచ్చిన బ్రాండ్ కు చెందిన వ్యవసాయ ముడి సరుకులను సేకరించుకునే పనిలో ఉన్నారని వ్యవసాయ విస్తరణ అధికారి రేష్మ తెలిపారు. కొంత మంది రైతులు తమకు కావాల్సిన విత్తన బ్రాండ్‌ల కోసం విత్తన వ్యాపారులతో ముందస్తు ఒప్పందాలు చేసుకోవడాన్ని గమనిస్తున్నామని అన్నారు. ఇలా చేయడం వల్ల ఆయా విత్తనాల బ్రాండ్‌ల కృత్రిమ కొరత ఏర్పడటానికి రైతులే కారణం అవుతారని వివరించారు. తొలకరి వర్షాలకు ఎవరూ కూడా విత్తనాలు విత్తు కోవద్దని సూచించారు. నేలలో సరైన తేమ ఉన్నప్పుడు విత్తు కుంటే మొలక శాతం బాగుంటుందని తెలిపారు. బరువైన నెలలలో 70 మి.మీ.తేలికపాటి నేలల్లో 60 మి.మీ వర్షపాతం పడిన తర్వాతే పంట విత్తు కోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో తిరుగుతూ లూజుగా విత్తనాలు, పురుగు మందులు అమ్మే నకిలీ వ్యాపారుల ఉచ్చులో పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

- అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి
- ఎస్సీ స్టడీ సర్కిల్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపాలి
- ప్రజావాణిలో ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలోగల వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు ఎస్కే అషర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మహిళా కార్పొరేషన్ ఆధ్వర్యంలో సుభాష్ నగర్‌లో కొనసాగుతున్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌పై అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. హాస్టల్ సమస్యలకు జిల్లా మేనేజర్ పద్మ నిర్లక్ష్యం, చేతివాటం కారణమని భావిస్తున్నామన్నారు. ఈ హాస్టల్లో నిరుపేద, దిగువ మధ్యతరగతి మహిళలు చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారన్నారు. వసతి గృహంలో ఉంటున్న మహిళలు నెలకు ?3500/- చెల్లిస్తున్నా నాణ్యమైన భోజనం ఉండడం లేదన్నారు. గతంలో ఉన్న వైఫై సౌకర్యం కూడా ఎత్తేయడంతో ఆన్లైన్ క్లాసులు వినలేకపోతున్నారన్నారు. వెంటనే వైఫై రీచార్జ్ చేయాలన్నారు. తాజా కూరగాయలతో నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారులు వెంటనే హాస్టల్‌ను సందర్శించి, అక్కడి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నగర నాయకులు సృజన్, అనూష తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సరికెల పోశెట్టి



వినితి పత్రం అందజేసిన నాయకులు

అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి

అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు సరికేల పోశెట్టి మాదిగ అన్నారు. సోమవారం ప్రజావాణి లో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్కానింగ్ సెంటర్లో మహిళలకు రక్షణ లేకుండా, అక్కడ ఉండే ఉద్యోగి స్కానింగ్ సెంటర్ కు (చికిత్స నిమిత్తం) వచ్చిన మహిళలను ట్రాప్ చేసి ఫోటోలను, వీడియోలను తీసి, వారిని బ్లాక్ మెయిల్ చేసి, వారిని ఉపయోగించుకున్నాడని ఆరోపించారు. వారి అశ్లీల చిత్రాలు తీయడం జరిగిందనే అంశంపై పలు పత్రికలలో వచ్చిన దానిపైన అయ్యప్ప స్కానింగ్ సెంటర్ పైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కొన్ని రోజుల క్రితం మెడికవర్ ఆసుపత్రిలో గుండెపోటుతో చికిత్స కోసం వచ్చిన రోగికి సరైన సమయానికి వైద్యం అందించక ఒక యువకుడు ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో మహిళలకు స్కాన్ చేసేందుకు మహిళ ఉద్యోగులనే నియమించాలని, పురుషులకు స్కానింగ్ చేసే సమయంలో పురుషులని ఉద్యోగులనే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ల్యాబ్, స్కానింగ్, ఎంఆర్ఐ, సిటీ రిపోర్టులను సరియైన, క్వాలిఫైడ్ అయిన వారు మాత్రమే రిపోర్ట్ లను చెక్ చేసి, (రిపోర్ట్ లను చెక్ చేసిన) వారి పేరును సంతకాన్ని, ఆ రిపోర్ట్ పైన ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొందరి డాక్టర్లకు రోగులు చెప్పే భాషనే రాదు అని, వారి దగ్గర అవగాహన లేని, క్వాలిఫైడ్ కానీ కాంపౌండర్ లను పెట్టుకొని, రోగికి వచ్చిన సమస్యను వారు వివరిస్తున్నారని, అటువంటి డాక్టర్ల పైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపాలి


నిధులు రికవరీ చేయాలి: పీడీఎస్‌యూ

సాంఘిక సంక్షేమ శాఖ, ఎస్సీ స్టడీ సర్కిల్ లో గత సంవత్సర కాలంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యు. ఆధ్వర్యంలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ.. నిజామబాద్ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ అక్రమాలకు నిలయంగా మారిందన్నారు. డీఎస్సీడీవో శశికళ, ఎస్సీ స్టడీ సర్కిల్ ఇంచార్జ్ వార్డెన్ ఎస్.మారుతి ఈ అక్రమాలకు మూల కారణమని ఆరోపించారు. వీరిద్దరూ కలిసి కిందిస్థాయి సిబ్బందిని వేధించి మరీ, వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వ పోటీ పరీక్షల సన్నద్ధత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్లు వీరికి ఆదాయ వనరులుగా మారాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి కల్పించడం మరిచి, ఆస్తులు పోగేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ స్టడీ సర్కిల్లో ఒక్కో విద్యార్థికి రూ.75 ప్రభుత్వం అందించడం జరుగుతుందన్నారు. నాసిరకం భోజనం, సౌకర్యాలలేమితో తక్కువ మంది హాజరైనా, 100 మంది హాజరవుతున్నారని లెక్కలు రాసి నిధులు కాజేశారన్నారు. ప్రశ్నించిన విద్యార్థులపై బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. సంక్షేమ హాస్టల్ సిబ్బందితో స్టడీ సర్కిల్లో పనులు చేయించుకుని, బినామీ పేర్లతో జీతాలు నొక్కేస్తున్నారన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలు వసూలు చేశారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖలో రెండు సంవత్సరాల నుండి నేటి వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ జరపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ళు, స్టడీ సర్కిల్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి, మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, లేనిచో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడీఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే అశుర్, జిల్లా నాయకులు నసీర్, నాగేష్, సలీం, వర్ధన్, సమీర్, సందీప్, శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య

నవతెలంగాణ-నంది పేట్

ప్రభుత్వ బడుల్లోనే ప్రైవేటుకు ధీటుగా విద్యనందిస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విటల్ రావు అన్నారు. సోమవారం ఆయన డొంకేశ్వర్ మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు మధ్యాహ్న భోజనం అందిస్తుందని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో ఎక్కువగా అడ్మిషన్లు చేయించినందుకు సిబ్బందిని ప్రశంసించారు. ఇంకా పెంచే ప్రయత్నం చేయాలని వారికి సూచించారు. కార్యక్రమం లో మండల విద్యాధికారి శ్రీ శ్రీనివాసరెడ్డి జడ్పీ హెచ్ ఎస్ హెచ్ ఎం సురేష్ కుమార్, ప్రైమరి హెచ్ ఎం సాబేర బేగం,అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు,ఉపాధ్యాయులు, వీడిసి కోశాధికారి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్

మాక్లూర్ : మండలంలోని మదన్ పల్లి గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి బడి బాట కార్యక్రమంలో జిల్లా జెడ్పీ చైర్మన్ డీ. విఠల్ రావు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి ఇంటికి వెళ్లి తల్లి దండ్రులతో మాట్లాడి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్య బోధన ఉంటుందని వివరించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కింద పనులు చేపడుతున్న పాఠశాలలను సందర్శించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఒడ్యాట్‌పల్లి గ్రామంలోని ఉపాధి హామీ పనులను పరిశీలించి, అధికారులు సూచించిన పనులను పూర్తి చేసి రోజువారీ డబ్బులు వచ్చేలా చూడాలని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకొని 100 రోజులు పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ క్రాంతి, పంచాయతీ రాజ్ ఏఇ శ్రీనివాస్, కార్పొరేటర్ రాజసింగ్, ఎంపీటీసీ ఒడెన్నా గ్రామస్తులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తారని మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్ అన్నారు. ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు , ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, ఇతర సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వరూప రాణి, ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్, ఉపాధ్యాయులు స్వరూప రాణి, సిఆర్పి నాగేష్, విడిసి సభ్యులు మహిపాల్ వెంకన్న లింగ గౌడ్, అంగన్వాడి వర్కర్లు ఆశాలు పాల్గొన్నారు.



మాక్లూర్‌లో...



జక్రాన్‌పల్లిలో...

జేఈఈ అడ్వాన్స్‌లో నారాయణ విద్యార్థుల జయకేతనం



విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయ సిబ్బంది

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నారాయణ కళాశాల విద్యార్థి జి. అన్వేష్ జాతీయ స్థాయిలో 1140 ర్యాంక్, మర్రి హర్ష జాతీయ స్థాయిలో 1220 ర్యాంక్ తో విజయ దుందుభి మోగించారని ప్రిన్సిపాల్ కుంట లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో 1140 ర్యాంక్ పొందిన అన్వేష్ మాట్లాడుతూ తనకు ఇంటర్‌లో 961 మార్కులు వచ్చాయన్నారు, ఐఐటీ ముంబైలో కంప్యూటర్ ఇంజినీర్‌గా చేరి భవిష్యత్తులో సాఫ్ట్ వేర్ కంపెనీ స్థాపించడమే తన లక్ష్యం అని పేర్కొన్నాడు. ఈ ర్యాంకు రావడానికి తోడ్పడిన నారాయణ కాలేజీ ఐఐటి షెడ్యూల్, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందానికి ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా జాతీయ స్థాయిలో 1220 ర్యాంక్ పొందిన మర్రి హర్ష మాట్లాడుతూజజ తను నిజామాబాద్, నారాయణ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసి 987 మార్కులు, ఈఏపి సెట్ లో 1579 వ ర్యాంక్, జేఈఈ మెయిన్ ఓపెన్ కేటగిరీలో 848వ ర్యాంక్ పొందానని ఐఐటీ లక్ష్యంగా రూపొందించిన నిజామాబాద్ నారాయణలో ఎన్-120 ప్రోగ్రాంలో 2 గంటల బోధన 9నెలల రివిజన్ ప్రోగ్రాం లోని పార్ట్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు, వీక్లీ అసైన్మెంట్స్ తన భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు. ఐఐటీ కాన్పూర్‌లో భౌతిక శాస్త్రంలో బీఎస్ కోర్స్ పూర్తి చేసి శాస్త్ర వేత్తగా దేశానికి సేవనందించడం నా లక్ష్యం అని పేర్కొన్నాడు. కార్యక్రమంలో నిజామాబాద్ ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి, ఏవో శేఖర్, కోర్ డీన్ వీరంజనేయ ప్రసాద్, జీఎం కె.శ్రీనివాస్ రావ్, కళాశాల అధ్యాపక బృందం అభినందించారు, ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల మొదటి బ్యాచ్ లోనే ఐఐటీ, జేఈఈ మెయిన్స్, ఎంసెట్ , నీట్ ర్యాంక్ లు సాధించామని, భవిష్యత్తులో నాణ్యమైన విద్యానందిస్తూ జేఈఈ, నీట్‌లో మంచి ర్యాంకులు సాధిస్తామని , విజయవంతమైన ఐఐటీ ప్రోగ్రాం అందించిన నారాయణ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు, ర్యాంకులు పొందిన విద్యార్థులను అభినందించారు.

ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందజేత

నవతెలంగాణ-బాల్కొండ

మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కరోసం కుట్టించిన ఏకరూప దుస్తులను, పాఠ్యపుస్తకాలను సోమవారం మండల విద్యా వనరుల కేంద్రంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బట్టు రాజేశ్వర్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, జడ్పిటిసి దాసరి లావణ్య వెంకటేష్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్ , సమాఖ్య ఏపిఎం గంగాధర్, సమాఖ్య సిసిలు,ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్లు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రైమరి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమరాణికి, విద్యార్థులకు ఎపిడి రవీందర్ ఏకరూపదుస్తులను సోమవారం ప్రాథమిక పాఠశాల లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకటి నుండి ఐదవ తరగతి విద్యార్థులకు సమయానికి కంటే ముందే పాఠశాలకు అందజేసిన టార్గెట్ 101ను పూర్తి చేసి అందజేయడం అభినందనీయమన్నారు. ఇతర పాఠశాలలకు సైతం సమయానికి ముందే అందజేసే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి చింతల దాస్, డిపిఎం సాయిలు, ఎంపిడిఓ అనంత్ రావు,ఎపిఎం సువర్ణ,సిసి ఉదయ్ కుమార్, గోవింద్, అనూరాధ,ఓబి లక్ష్మీ, లింగమణి, సిఏ కవిత తదితరులున్నారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు 2024-25వ సంవత్సరానికి సంబందించి విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను ఆయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం మండల విద్యాధికారి ఆంధ్రయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని విద్య వనరుల కేంద్రంలో పాఠ్య పుస్తకాలను, నోట్ బుక్స్ ను చౌట్ పల్లి, కొన సముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ ఆంధ్రయ్య మాట్లాడుతూ ఆయా పాఠశాలలకు 1వ తరగతి నుండి 10వ తరగతి 18,983 పాఠ్యపుస్తకాలు, అదేవిధంగా 5వ తరగతి నుండి 10 వ తరగతి విద్యార్థులకు 12,668 నోటు బుక్స్ వచ్చినట్లు ఆయన తెలిపారు.12వ తేదీ పాఠశాలల పున్హ ప్రారంభం పురస్కరించుకొని మొదటిరోజు రెండు పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్‌లను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సిఆర్పీలు బి.అంజయ్య పి.అంజయ్య రాజేష్, నందగిరి లలిత, ఐఈఆర్ పి రాజన్న, మెసేంజర్ రతన్, తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి: విద్యార్థులకు దుస్తులను అందజేస్తున్న ఎపిడి రవీందర్



బాల్కొండలో...



కమ్మర్‌పల్లిలో...

బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్సెస్ కోర్సుకు ఆహ్వానం

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్)లో నాలుగు సంవత్సరాల బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్సెస్ కోర్సును ఈ సంవత్సరం ప్రవేశపెట్టినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాధిక తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎం.పీ.సీ. గ్రూప్ నుంచి పాస్ అయిన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులని, దరఖాస్తు చేసుకోవడానికి మర్కల్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను సంప్రదించాలని సూచించారు. కళాశాలలో ఈ కోర్స్ ప్రవేశపెట్టడం ఎంతో హర్షనీయమని, ఈ కోర్సుకు మార్కెట్లో మంచి ఆదరణ ఉంటుందని, ఈ కోర్స్ బీటెక్‌కు తత్సమానమని వివరించారు. కావున ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ గ్రూప్‌లో ఉత్తీర్ణులైన మహిళా విద్యార్థులు ఈ నెలలోనే దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

కొనసాగుతున్న బడిబాట


విద్యార్థులను స్కూల్‌లో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం కొనసాగుతుంది. సోమవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్, ఎం.ఏ నగర్, గోశాల కాలనీలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి) ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. ఈ బడిబాట కార్యక్రమంలో ఎం.ఏ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గల విద్యార్థులను ఆరవ తరగతి ఉర్దూ మీడియంలో చేర్పించారు. అలాగే మరో పది మంది విద్యార్థులను ఎనిమిదో తరగతి ఉర్దూ మీడియంలో చేర్పించారు. ఈ బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు అఫ్షాన్, ఫర్జానా, శాకీరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు సిద్ధం

- పలుచోట్ల విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-విలేకరుల బృందం

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు సిద్ధమయ్యాయి. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పలు గ్రామాల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తులకు పంపిణీ చేశారు.

నాగిరెడ్డిపేట్ : నాగిరెడ్డిపేట్ మండల సమైక్య ఆధ్వర్యంలో మహిళా శక్తి కుట్టుమిషన్ ద్వారా కుట్టిన ఏకరూప దుస్తులను సోమవారం ఆయా పాఠశాలలకు ఎంపీపీ టేకులపల్లి వినీత, జడ్పీటీసి మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం జగదీష్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 3,352 విద్యార్థులకు గానూ దుస్తులు అందజేయాలని ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో గల కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థుల కొరకు పాఠశాల ప్రిన్సిపాల్ వీణకు దుస్తులను అందజేసినట్లు ఆయన తెలిపారు. మిగతా పాఠశాలలకు రెండు రోజుల్లోగా ఏకరూప దుస్తులను అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పర్బన, మండల సమైక్య అధ్యక్షురాలు శాంత, సీసీలు దత్తు, నారాయణ, రమేష్, శ్రీనివాసరెడ్డి, సుజాత, అకౌంటెంట్ రాజు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీపీకి సన్మానం..

నాగిరెడ్డిపేట్ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన టేకులపల్లి వినీతను సోమవారం మండల సమైక్య ఆధ్వర్యంలో సన్మానించారు.

బోధన్ : బోధన్ మండల మహిళా సమాఖ్య-1 ఆధ్వర్యంలో సోమవారం సాలూర మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల, దళిత వాడలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేయడానికి మహిళా సమస్యలకు కుట్టుపని అప్పగించిందని దాంతో విద్యార్థుల సౌకర్యార్థం దుస్తులను సకాలంలో కుట్టి ఇచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలకు మహిళా సంఘాల సమాఖ్య ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు సబితాకుమారి, రిహనాబేగం, ఐకెపి సిసి మణి, దీప, సీఏలు కృష్ణవేణి, భూమయ్య, షీలా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాజమణి, కిరణ్మయి స్థానికులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు ఎంఈఓకు అప్పగింత

సదాశివనగర్ : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల కోసం మహిళా సంఘాల ద్వారా కుట్టిన ఏకరూప దుస్తులను సోమవారం మండలంలో ఎంఈఓ యోసఫ్‌కు అందించారు. కార్యక్రమంలో పిడిఆర్‌డిఓ చందర్ నాయక్ ఎంఈఓకు అప్పగించారు. ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపిఓ సురేందర్‌రెడ్డి, డిపిఎం రమేష్ బాబు, ఏపిఎం రాజారెడ్డి, సీసీలు గౌరె రాములు, అంజయ్య, అబ్బు లింగం, నరేందర్‌రెడ్డి, కృష్ణ, అంజలి, సౌజన్య, అకౌంటెంట్ రమేష్, గ్రామపంచాయతీ సెక్రెటరీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : ఈ నెల 12 నుంచి ప్రారంభమయ్యే ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేసినట్టు ఎంపీపీ రజిని కిషోర్, ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలను, ఏకరూప దుస్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెంజల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు నాలుగు కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి 3900 డ్రెస్‌లను పూర్తి చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేస్తున్నట్టు వివరించారు. మండలానికి 16 వేల పుస్తకాలు ప్రస్తుతం పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వాటిని పాఠశాలల్లోకి తీసుకువెళ్లాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ గణేష్‌రావు, పిఆర్‌టియు మండలాధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగం గౌడ్, సాయిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, దూపల్లి పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి, ఏపీఎం చిన్నయ్య, దూపల్లి పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణ, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బోధన్: విద్యార్థులకు దుస్తులను అందజేత


నాగిరెడ్డిపేట్‌లో...


సదాశివనగర్‌లో...


రెంజల్‌లో...

యువకుడు అదృశ్యం.. కేసు నమోదు


సాయిలు(ఫైల్)

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన పల్లికొండ సాయిలు (35) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎడపల్లి పోలీసులు తెలిపారు. సాయిలు భార్య పల్లికొండ కల్పన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై వంశీకృష్ణరెడ్డి వివరాల ప్రకారం.. ఈనెల 9న ఉదయం సుమారు 7:30 ప్రాంతంలో పల్లికొండ సాయిలు ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్ళిపోయాడు. ఆచూకీ కోసం బంధువుల, స్నేహితుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రైతు నేస్తం

- మండల వ్యవసాయ అధికారి రాజు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో రైతు నేస్తం కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు పలు అంశాలపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలచే అవగాహన కల్పించనున్నట్టు మద్నూర్ మండల వ్యవసాయ అధికారి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జుక్కల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి

- మైనార్టీ సెల్ మండలాధ్యక్షులు జావిద్ పటేల్


మాట్లాడుతున్న మైనార్టీ సెల్ మండలాధ్యక్షులు జావిద్ పటేల్

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్రంలో జరగబోయే మంత్రివర్గ విస్తరణ కార్యక్రమంలో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గ జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావుకు మంత్రి పదవి ఇవ్వాలని మద్నూర్ మైనార్టీ సెల్ అధ్యక్షులు జావిద్ పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడి ఉందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే జుక్కల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని పేర్కొన్నారు. మైనారిటీల విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ జుక్కల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి కట్టబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ ప్రహరీ నిర్మాణ పనులను నిలిపివేయాలి

- కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలాపేపర్ మిల్లు గ్రామ సమీపంలో నిజామాబాద్‌కు చెందిన వ్యక్తి పేపర్‌మిల్లులో స్థలాన్ని కొనుగోలు చేసి అక్రమంగా ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారని, పేపర్‌మిల్లు గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నిర్మాణం వల్ల డి50/2/17 వ్యవసాయ కాలువను సైతం కబ్జా చేశారని వారు ఆరోపించారు. ఇటీవల ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు కాలువ ఉన్న మాట వాస్తవాన్ని దీని మరమ్మతుల కోసం నాలుగు లక్షల 50 వేల రూపాయల ప్రతిపాదనలు కూడా పంపినట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఈ రోడ్డు ద్వారా సీలింగ్ భూములు ఉన్న రైతులు వెళ్లడానికి ఉండేదని, ప్రస్తుతం వారిని అటు రాకుండా అడ్డుగా గోడ కట్టడం రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు వెంటనే ఈ విషయంపై స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ముఖీ, అవేజ్, నీలుఖాన్, జలాలుద్దీన్, గంగాధర్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి గ్రామంలో మంగళవారం చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరించనున్నట్టు రజక సంఘం సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావును సోమవారం నాగిరెడి పేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాగిరెడ్డిపేట మండల అభివృద్ధిపై ఎమ్మెల్యేతో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు


ఎమ్మెల్యేను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావుకు ఆదివారం రాత్రి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ మండల నాయకులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు 25 రోజులపాటు విదేశాలలో పర్యటించారు. ఐటీ రంగం అభివృద్ధి, తెలంగాణలో ఐటీ పరిశ్రమలు ఏర్పాటు తదితర అంశాలపై 25 రోజులు పాటు విదేశీ ఐటీ కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి తెలంగాణలో ఐటీ రంగాన్ని బలోపేతం చేయడం కోసం విదేశాల్లో పర్యటించారు. విదేశాల్లో పర్యటనలు ముగించుకుని ఆదివారం రాత్రి స్వదేశానికి వచ్చిన సందర్భంగా నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు పెద్దఎత్తున తరలివెళ్లారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. విమానాశ్రయంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎల్లారెడ్డి సింగిల్ విండో వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, నాగం సాయిబాబా, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు తదితరులున్నారు.

హామీలను అమలు చేయకపోతే ప్రజా పోరాటాలు

- పంట పండించే ప్రతి రైతుకు పంట రుణాలు ఇవ్వాలి
- చెరువు శిఖాలు, ప్రభుత్వ భూములను రక్షించి పేదలకు పంచాలి
- ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి
- ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్



మాట్లాడుతున్న ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయకపోతే ప్రజా పోరాటాలు తప్పవని ఈ క్రమంలో గత ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్ హెచ్చరించారు. సోమవారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య)-ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికీ 7 నెలలు గడిచినా.. ఎన్నికల ముందు ఇచ్చిన ముఖ్యమైన హామీలను అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమై రైతాంగం విత్తనాలను నాటడానికి ప్రయత్నిస్తుండగా ఇప్పటివరకు రైతులకు అవసరమైన విత్తనాలను ఎరువులను సరఫరా చేయకుండా పరోక్షంగా నకిలీ విత్తనాలను బ్లాక్ మార్కెటింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్లు కనబడుతున్నదన్నారు. మరోవైపు పంటల పెట్టుబడి కోసం రుణాల ప్రక్రియ సైతం ప్రారంభించలేదని, రెండులక్షల రుణమాఫీని ఆగస్టు 15 తర్వాత చేస్తామని అనడంతో బ్యాంకర్లు తక్షణమే రైతులకు పంట రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని అన్నారు. కౌలు రైతులను నేటికీ గుర్తించకుండా తాత్సారం చేయడం తగదన్నారు. పంట పండించే ప్రతి రైతుకు పంట రుణం, ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఆక్రమణకు గురైన చెరువు శిఖం వివిధ రకాల ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పెంచాలన్నారు. ఇప్పటికే పేదల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని కోరారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనైనా ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టి ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజా పోరాటాలను నిర్మిస్తామని తద్వారా గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నరసింహులు, సదానందం, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు


బడిబాటలో ఉపాధ్యాయులు

నవతెలంగాణ-రెంజల్

ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తూ, ఆంగ్ల మాధ్యమం, బోధిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తుందని మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు తెలిపారు. సోమవారం మండలంలోని దూపల్లి గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి, పిఆర్టియు మండల అధ్యక్షులు సోమలింగంగౌడ్, ఉపాధ్యాయులు సాయన్న లక్ష్మీదేవమ్మ, రాజేశ్వర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు

దుస్తులు కుట్టడం పూర్తవ్వాలి

- డీపీఎం సంధ్య

నవతెలంగాణ-రెంజల్

పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు మండలంలోని అన్ని స్కూళకు ఏకరూప దుస్తులను అందేలా చర్యలు తీసుకోవాలని డిపిఎం సంధ్య స్పష్టం చేశారు. ఈ నెల 12లోపు విద్యార్థులందరికీ ఏకరూప దుస్తులు అందేలా చూడాలని ఐకెపి ఏపిఎం చిన్నయ్యను ఆదేశించారు. సోమవారం ఐకెపి కార్యాలయంలో టైలరింగ్ మహిళలకు అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. డ్రెస్సులు కుట్టే సమయంలో దూరం కాకుండా దగ్గర దగ్గర వచ్చేలా చూడాలని వారికి సూచించారు. ప్రతి పాఠశాలలో ఎంతమంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారో ప్రతి సిఏకి అవగాహన ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 13న ప్రతి విద్యార్థి ఏకరూప దుస్తులతో పాఠశాలలకు రావాలని ఆమె సీఏలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం చిన్నయ్య, సీసీ భాస్కర్, శివకుమార్, కృష్ణ, రాజయ్య, శ్యామల, సునీత, కంప్యూటర్ ఆపరేటర్ తస్లీమా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీపీఎం సంధ్య

బీడీ కార్మికుల సంబురాలు

- బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులకు సన్మానం


స్వీట్లు తినిపించుకుంటున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

బీడీ కార్మికులకు ప్యాకర్లకు, బట్టి, బీడీ టేకేదార్లకు, బీడీ కట్టలకు, బుర్రలు పెట్టే కార్మికులకు వేతనాలు పెరిగిన సందర్భంగా కామారెడ్డి, జిల్లా కేంద్రం శివసాగర్, చిన్న మల్లారెడ్డి టెలిఫోన్, భవానీపేట్, బీడీ సెంటర్‌లో తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సిద్ధిరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఆంజనేయులకు కార్మికులు శాలువాతో సన్మానించారు. స్వీట్లు పంపిణీ చేసుకొని సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో శివసాగర్, బీడీ సెంటర్‌లో బీడీ టేకేదార్ ఎం.భాస్కర్, హన్మండ్లు, సిద్ధిరాములు, పోశెట్టి, సాయిలు, బీడీ ప్యాకర్లు, చక్రపాణి, రాములు, శ్రీ నివాస్, చటన్, పురుషోత్తం, రాజు, ప్రతాప్‌రెడ్డి, బట్టి, మార్కండయ్య, చిన్న మల్లారెడ్డి టెలిఫోన్ బీడీ ప్యాకర్లు, స్వామి, కిషన్, పెంటయ్య, భవానీపేట్, దీఫాక్ బీడీ ప్యాకర్లు, బాల్ కిషన్, ఖదీర్, మల్లయ్య, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
మంగళవారం | జూన్ 11, 2024 | www.navatelangana.com

ఆల్ ఇండియా రైఫిల్ షూటింగ్ పోటీలకు రేఖా రాణి



నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

25 వ ఆల్ ఇండియా పోలీస్ రైఫిల్ షష్ట్రటింగ్ పోటీలకు నిజామాబాద్ జిల్లా నాల్గవ టౌన్ ఉమెన్ పిసి రేఖా రాణి ఎంపికయ్యారు. ఇటీవలే హైదరాబాదులోని అప్ప పోలీస్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి ఆలిండియా రైఫిల్ షూటింగ్ పోటీలకు జిల్లా నుండి ఏకైక క్రీడాకారిణి రేఖా రాణి ఎంపిక అవడం విశేషం. నిజామాబాదు నాలుగవ పోలీస్ స్టేషన్లో షీటీం లో రేఖ రాణి (డబ్ల్యూ పిసి 325) విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 15 నుంచి తమిళనాడులోని ఒటీవాకం ఫైరింగ్ రేంజ్‌లో జరగబోయే ఆల్ ఇండియా పోలీస్ రైఫిల్ షుఉటింగ్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ జట్టు తరపున రేఖా రాణి పాల్గొననున్నారు. రేఖ రాణి ఫుట్బాల్ క్రీడాకారిణి, మాస్టర్ అథ్లెటిక్స్ లో సైతం రానించి పలు పతకాలు సాధించారు. 2002లో పోలీస్ ఉద్యోగం లో చేరారు. ఈ ఎంపిక పట్ల తెలంగాణ రాష్ట్ర పోలీస్ జిల్లా పోలీస్ యంత్రాంగం హర్షం వ్యక్తం చేశారు.

ఈ సెట్ మొదటి విడత కౌన్సిలింగ్‌కి సర్టిఫికేట్ వెరిఫికేషన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

డిప్లొమా కోర్సు పూర్తయి ఇంజనీరింగ్ కోర్సు చేయుటకు సంబంధించిన ఈ సెట్-2024 మొదటి విడత కౌన్సిలింగ్‌కు సంబంధించిన సర్టిఫికేట్ వెరిఫికేషన్ సోమవారం నుంచి మొదలైందని ఇందులో భాగంగా స్లాట్ బుక్ చేసుకున్న 360 మంది మంది విద్యార్థులు సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయడం జరిగిందని జిల్లా సమన్వయకర్త సి. శ్రీరామ్ కుమార్, సిస్టమ్ అడ్మిన్ కె.భాను చందర్ తెలిపారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఈ నెల 12 వ వరకు ఉంటుందని తెలిపారు. వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు వెబ్ ఆప్షన్ 10 తేది నుండి 14 తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు https://tgecet.nic.in website లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

వేంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షలో 27 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ తెలిపారు.. ఈ సందర్భంగా సోమవారం రోజు ఉదయం గురుకులకు ఎంపికైన విద్యార్థులకు మెమొంటోలు ప్రధానం చేయడం జరిగిందన్నారు. పాఠశాల విద్యార్థుల ప్రతిభ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు సతీష్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పిప్పెర గణేష్, వైస్ చైర్మన్ ఎట్టం రవి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కార్మిక సంఘం అధ్యక్షులు బాబురావు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ కార్మిక సంఘాల రాష్ట్ర జేఏసీ ఏఐటీయూసీ అధ్యక్షులు బాబురావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 4 ప్రకారం ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు జూన్ 2021 నుండి 30శాతం పెంచారన్నారు. కానీ పెరిగిన వేతనాలు జులై 20 23 నుండి మాత్రమే చెల్లించడం జరిగిందని అన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్లకు విన్నవించగా కౌన్సిల్ వారు నవంబర్ 2022 నుండి జూన్ 2023 వరకు 8 నెలలు పెరిగిన వేతనాలు ఏరియర్స్ రూపంలో చెల్లించుటకు ఆమోదం తెలిపారని అన్నారు. కానీ కేవలం ఒక నెల ఏరియర్స్ చెల్లించారని మిగితావి వెంటనే చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ కట్టాలని, సానిటరీ సిబ్బందికి బట్టలు సబ్బులు ఇప్పించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సన్మానించిన సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-ముప్కాల్

వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్ర భారతి హైదరాబాదులో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పదోతరగతిలో 10/10 జీపీఏ సాధించిన పాఠశాల విద్యార్థులు సీహెచ్.రచన, టి.ప్రశాంత్, టి.కార్తికేయ చారిలను సన్మానించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిభ చూపిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ రానున్న రోజుల్లో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. పాఠశాల అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, రాష్ట్ర పాఠశాల ఎడ్యుకేషన్ కమిషనర్, డైరెక్టర్ దేవసేన, ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్, రాష్ట్ర కార్యదర్శి మాధవ రెడ్డి, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులకు శుభాకాంక్షలు తెలిపిన అర్బన్ ఎమ్మెల్యే



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఎల్ఎ ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రధాని మోదీ నాయకత్వంలో 3.0 కేంద్ర కేబినెట్లో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన గంగాపురం కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌లకు తెలంగాణ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజల తరపున అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు

పశువుల అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు

- అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బక్రీద్ వేడుకను పురస్కరించుకుని అదనపు కలెక్టర్ అధ్యక్షతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆయన ఛాంబర్‌లో సోమవారం జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షిస్తూ, సూచనలు చేశారు. జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాలు పక్కాగా అమలయ్యేలా చూడాలని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని అన్నారు. గోవధ నిషేధ చట్టం 1977 ప్రకారం గోవధను నిషేధించినందున ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఎక్కడ కూడా గోవధ జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లాలోని కందకుర్తి, సాటాపూర్, సాలూర, పొతంగల్, ఖండ్ గావ్, యంచ, పోచంపాడ్, కమ్మరపల్లి, ఇందల్వాయి తదితర ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. నిబంధలు విరుద్ధంగా వివిధ వాహనాలలో పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజ్ చేసిన పశువులకు స్థానికంగానే షెల్టర్ కల్పిస్తూ, వాటికి పశుగ్రాసం, నీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో గోశాల నిర్వాహకుల సహకారం తీసుకోవాలని అన్నారు. సాటాపూర్, ఇందల్వాయి తదితర చోట్ల కొనసాగే పశువుల వారాంతపు సంతలలో నిబంధలు అనుగుణంగా, పశు సంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఎక్కడబడితే అక్కడ పశువులను వధించకుండా కట్టడి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, రాజేశ్వర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథ చారి, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ ఏ.ఓ సిద్ధిరాములు, నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ సాజిద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుత్ను అధికారి

సమాజమార్పులో విద్యార్థులే చోదక శక్తి

- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియల్ సభ్యులు ప్రభాకం

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న నాయకులు ప్రభాకర్

సమాజ మార్పులో విద్యార్థులే చోదక శక్తి అని, సమాజ స్థితి, గతులను మార్చే శక్తి విద్యార్థులకే ఉంది అని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ప్రభాకర్ అన్నారు. సోమవారం అర్గుల్‌లో పిడిఎస్యు రాష్ట్ర స్థాయి "రాజకీయ విజ్ఞాన తరగతులను ఆయన ప్రారంభించారు. ముందుగా పిడిఎస్‌ు జెండాను పెద్దింటి రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భం గా జరిగిన సభలో పిడిఎస్‌యు అమరవీరుల సంతాప తీర్మానాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వి.ప్రభాకర్ మాట్లాడుతు: దోపిడీ, పీడన లేని సమాజంకోసం విద్యార్థులు అగ్రభాగనా నిలబడి పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పును ఇచ్చారని, మోడీ అహంకారం, మత ఉన్మాదంను ఓడించారు ఆయన అన్నారు. బీజేపీ, మోడీ ఏకాదిపత్య పాలనాకు ప్రజలు చరమ గీతం పాడారని, మోడీ చరిష్మా ఈ ఎన్నికల్లో ఏమాత్రం పనిచేయలేదు అన్నారు. రామనామం ప్రస్తుత ఎన్నికల్లో ఎక్స్‌పైర్ అయింది అని, ప్రజల సమస్యల ను విస్మరిస్తే ప్రజలు పెంటకుప్పలోకి విసిరేస్తారు అని ఆయన అన్నారు. ఎన్‌డీఏ సంకీర్ణపాలన మోడీకీ కత్తిమీది సాములాంటిది అని అన్నారు. ఢిల్లీలో రైతులు చేపట్టిన ఉద్యమం దేశప్రజల్ని ఎంతో చైతన్యం చేసింది అని ప్రజలకు పోరాట స్పూర్తిని ఇచ్చింది అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆవుల అశోక్ మాట్లాడుతూ.. సమాజాన్ని విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయాలని, ప్రజాపోరాటల్లో విద్యార్థులు మమేకం అయి నూతన సమాజం పునర్ నిర్మాణంలో భాగస్వాములు అవ్వాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జాతీయ యునివర్సిటీ కోఆర్డినేటర్ ఎస్ నాగేశ్వరరావు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేందర్, అనిల్, పృథ్వీ రాష్ట్ర సహాయ కార్యదర్శిలు అఖిల్, సాయి కోశాధికారి సురేష్, రాష్ట్ర నాయకులు గణేష్,అనిల్, అషఉర్, వెంకటేష్, దీపిక, కావ్య సీతారాం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యాకమిషన్, వ్యవసాయ కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం

- మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్



మాట్లాడుతున్న కొక్కెర భూమన్న

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యాకమిషన్, వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కెర భూమన్న అన్నారు. హైదారాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన సభలో ప్రభుత్వ పాఠశాలలలో పదవ తరగతిలో పదికి పది మార్కులు సాధించిన విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ముఖ్యంత్రి ఆశయం నెరవేరాలంటే ప్రభుత్వ పాఠశాలలలో, కళాశాలలో చదివే విద్యార్థులకు విద్య ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో 75శాతం వాటా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడ చదివేది పేద విద్యార్థులేనని, డబ్బులు ఉన్న వారని అన్నారు. విద్యా హక్కు చట్టం ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు,. అంతే కాకుండా ప్రైవేట్ యూనివర్సిటీల్లో ఎస్సి, బిసి, ఎస్టీ, రిజర్వేషన్లను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో కళాశాలలో చదివితేనే రిజర్వేషన్లు అనే అంశంను పరిశీలించి కార్యరూపం కోసం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎల్ టి కుమార్, మెతరి సాయన్న, స్వామి తది తరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ చేసిన నలుగురు అరెస్టు

- అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి బస్వా రెడ్డి



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ బస్వారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

చైన్ స్నాచింగ్లు చేస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. బస్వారెడ్డి తెలిపారు. పట్టణ ఎసిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జాతీయ రహదారి 63 మోర్తాడ్ మండలంలోని దోన్కల్ గ్రామ ఎక్స్ రోడ్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి వద్దనుండి 15.7 తులాల బంగారం, ఒక పల్సర్ బైక్ ,ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట చంచల్గూడాకు చెందిన కారు మెకానిక్ గా పని చేసే అబ్దుల్ సాజిద్,ఇదే గ్రామానికి చెందిన పాతూరి తరుణ్, జిల్లాలోని డిచ్పల్లికి చెందిన బోయర్ శేఖర్, జిల్లా కేంద్రంలోని మిర్చి కాంపౌండ్ కు చెందిన సాయికుమార్ అనే నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరు జిల్లాలోని మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో, మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంజర్ గ్రామంలో, బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టాపూర్, ఆలూర్ మండలంలోని దేగాం గ్రామంలో ,లక్ష్మణ్ చందా పోలీస్ స్టేషన్ పరిధిలోని పిచారా, జన్నారం స్టేషన్ పరిధిలోని కాలమడుగు గ్రామాలలో చైన్ స్నాచింగ్లు చేసినట్టు తెలిపారు. వీరిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మోర్తాడ్ ఎస్సై జి.అనిల్ రెడ్డి, పిసిలు సురేష్, నారాయణ, కమ్మర్‌పల్లి పిసి నవీన్ చంద్రాను జిల్లా సిపి అభినందించినట్టు తెలిపారు. సమావేశంలో భీమ్గల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అన్ని రంగాల కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్టియు నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఐఎఫ్టియు సమావేశం నగరంలో కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూమన్న, దాసులు పాల్గొని మాట్లాడారు. గత కెసిఆర్ ప్రభుత్వం పంచాయతీ, బీడీ, కేజీబీవీ, బిఓసి, హమాలి, మోటారు రంగా కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేసిందని వారన్నారు. పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాల వద్దకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, కాబట్టి జీపీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని వారు కోరారు. ఆంక్షలు లేకుండా బీడీ కార్మికులందరికీ జీవన భృతి ఇవ్వాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు నిర్మించి ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. గతంలో వివిధ కార్మికులకు ఇచ్చిన జీవోలను గెజిట్ ఎక్కించాలని, ప్రభుత్వ అధికారులను ఆదేశించాలని వారు కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తెలంగాణ రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయాలని, కార్మికుల ఉపాధి భద్రత కాపాడాలని, రాష్ట్రంలో నూతన పరిశ్రమలను నెలకొల్పాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని వారు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. కార్మిక రంగ సమస్యల పరిష్కారం చేయాలని ఈనెల 24న కలెక్టర్ కు వినతి పత్రం అందజేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు జెల్లామురళి, సూర్య శివాజీ, శివకుమార్, జేపీ గంగాధర్, అబ్దుల్, భారతి, కాజా, దాల్మల్కిపోశెట్టి, టి రాజు,మోహన్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా యాసిన్



చైర్మన్ యాసిన్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ హ్యాండ్ బాగ్ అసోసియేషన్ టెక్నికల్ కమిటీ చైర్మన్గా నిజామాబాద్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ యాసీన్ తొరడియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 9న తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్, హెచ్ఏ ప్రెసిడెంట్ ఏ.జగన్ మోహన్ రావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సురభి కాన్ఫరెన్స్ హాల్‌లో ఆన్యువల్ జనరల్ బాడీ మీటింగ్‌లో మహమ్మద్ యాసీన్ ను తెలంగాణ హ్యాండ్ బాల్ టెక్నికల్ కమిటీ చైర్మన్గా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అనిమల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీ తేజ్ రాజ్ సింగ్ , ఇండియన్ హ్యాండ్ బాల్ కోచ్ రవి, శ్రీశివం , జోషి, లు పాల్గొన్నారు. ఈ అంబికా పట్ల జిల్లా క్రీడా ప్రతినిధులు జిల్లా హ్యాండ్ వాలా అసోసియేషన్ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంఎల్‌హెచ్‌పీలకు నియామక పత్రాలు అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, హెల్త్ వెల్నెస్ సెంటర్స్‌లలో ఖాళీలను ఎంఎల్‌హెచ్‌పిల ద్వారా నియామకం చేయుటలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ సోమవారం వైద్యాధికారి కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. జిల్లాలో మొత్తం ఎంఎల్‌హెచ్‌పీలు 46 మంది అభ్యర్థులకు పోస్టింగులు ఇచ్చారు. ఇటీవల ఎన్నికల కోడ్ కారణంగా నియామక పత్రాలు అందజేయడంలో ఆలస్యమైనందున ఎన్నికల కోడ్ ముగిసినందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం అర్హులందరికీ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కీలకంగా వ్యవహరిస్తూ గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించాలని అన్నారు. ప్రజల జీవన శైలిని మార్చటంలో భాగస్వాములు కావాలని, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెంపొందించాలని ఈ సందర్భంగా వారికి తెలిపారు. విధి నిర్వహణ బాధ్యతలను ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఏవో చందర్, డాక్టర్ వెంకటేష్, సూపరిండెంట్ వినయ్ కుమార్, డి.హెచ్.ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈఓ నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ పారానా పాల్గొన్నారు.

నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి



సొసైటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి సహకార సొసైటీ చైర్మన్‌గా నోముల శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికై సోమవారం బాధ్యతలను స్వీకరించారు.జిల్లా సహకార సంఘ ఎన్నికల కార్యాలయ అసిస్టెంట్ రిజిస్టర్ పీ. మురళి పాల్గొని చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి నియామకపు పత్రాన్ని అందజేశారు. ఐడిసిఎంఎస్, సహకార సొసైటీ చైర్మన్‌గా ఉన్న సాంబార్ మోహన్ ఏప్రిల్19న అవిశ్వాస తీర్మానంపై చర్చ, సమావేశం ఏర్పాటు చేసినప్పుడు అరగంట ముందు చైర్మన్ సాంబార్ మోహన్ చైర్మన్ తన పదవికి రాజీనామా లేఖను సమర్పించారు. వెంటనే దాన్ని ఆమోదించినట్లు అనాడు అదికారులు తెలిపారు. రాజీనామాతో ఖాళీ అయిన చైర్మన్ స్థానానికి ఇంచార్జీ చైర్మన్‌గా ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న రమేష్‌కు తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించారు. 9మంది డైరెక్టర్లు బలనిరూపణ పరీక్ష ఉదయం 10గంటలకు ఉండటంతో సమయానికి డైరెక్టర్లు సహకార సొసైటీ కి చేరుకున్నారు. ముందుగా చైర్మన్‌గా పోటీ చేస్తున్న శ్రీనివాస్ రెడ్డి తన నామినేషన్ను దాఖలు చేశారు. ఇతర నామినేషన్ రాకపోవడంతో శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా చైర్మన్గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మురళి ప్రకటించి నియామకాపు పత్రాన్ని అందజేశారు

ఎమ్మెల్యే సహకారంలో సొసైటీని అభివృద్ధి చేస్తా

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో నల్లవెల్లి సహకార సొసైటీ ని అన్నీ రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ, రైతులకు ఎళ్ళవేళల అందుబాటులో ఉంటానని,తనపై నమ్మకం ఉంచి చైర్మన్ చేసిన తోటి డైరెక్టర్లకు, సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రైతుల అవసరాల మేరకు విత్తనాలను, ఎరువులను, అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపడతానని పేర్కొన్నారు.

రలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

నల్లవెల్లి సహకార సొసైటీ చైర్మన్ గా నోముల శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్యారి నవీన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నారెడ్డి సంతోష్ రెడ్డి, డిసిసి డెలిగేట్ నోముల వెంకట్ రెడ్డి,కుంట గంగారెడ్డి, మాజీ ఎంపిటిసి చింతల కిషన్, సీనియర్ నాయకులు బోర్వేల్ రాజేందర్ రెడ్డి, గంగాధర్,తోపాటు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొని ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అంతకుముందు పుల మాల శాలువా తో సత్కరించారు.ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇందల్ వాయి పోలిస్ సిబ్బంది తో బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం లో సిఈఓ తేజ గౌడ్, మాజీ సర్పంచ్ రాములు నాయక్, మాజీ ఉప సర్పంచ్ నవీన్ గౌడ్, పరుశురాం, బి గంగాధర్, మహిపాల్, డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ రుపొందించిన బడిబాట కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోందని వివరించారు. ఈ సందర్భంగా బడిబాటలో భాగంగా ప్రతి ఇంటికి తిరుగుతూ ఐదు సంవత్సరాలు నిండిన బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫార్మ్ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మార బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, లావణ్య, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు సావిత్రి, రాణి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో నవోదయ ప్రభంజనం

నవతెలంగాణ-నిజాంసాగర్





జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యను అభ్యసించిన బి.శ్రీశాంత్, బి.జగన్ ఇద్దరు విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024లో ఆల్ ఓవర్ ఇండియాలో మంచి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ సత్యావతి సోమవారం తెలిపారు. బి.శ్రీశాంత్ ఆల్ ఇండియా (265) ర్యాంక్, బి.జగన్ ఆల్ ఇండియా (953) ర్యాంక్ సాధించారని ఆమె తెలిపారు. ఈ విద్యార్థులు సాధించిన విజయాలు వారి కృషికి నిదర్శనమని ఇందుకు ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని పాఠశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి గర్వపడుతున్నామని విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి పాఠశాల మూలమని తెలిపారు.

ప్రమాద మలుపులు

- మూలమలుపుల వద్ద లేని సూచిక బోర్డులు
- ప్రమాదాలకు కారణమవుతున్న అతివేగం
- ప్రాణాలు కోల్పోతున్న యువత, మైనర్లు

నవతెలంగాణ-లింగంపేట్

రోడ్డు మలుపులు అధికంగా ఉండడంతో ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు పోతున్నాయి. ముఖ్యంగా యువత, మైనర్లు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. మూలమలుపుల వద్ద ఆర్అండ్‌బి శాఖ అధికారులు సూచికలు ఏర్పాటు చేయలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణాలు పోతున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారికి అధికంగా రోడ్డు మార్పులు ఉండడంతో ప్రమాదాలకు దారితీస్తున్నాయి.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 2732 వేల కిలోమీటర్ల రహదారులు ఉన్నాయి. ఇందులో జిల్లా రహదారులు 230 కిలోమీటర్లు, గ్రామీణ, ఇతర రహదారులు 252, జిల్లా పరిషత్, రోడ్డు భవనాల శాఖ 98, పంచాయతీరాజ్, రోడ్డు భవనాల శాఖ 274 కిలోమీటర్లు, రెండు వరుసల రహదారులు 465, సింగిల్ రహదారులు 421, బీటీ రహదారులు 902 కిలోమీటర్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన రహదారి ఇరువైపులా మూలమలుపుల వద్ద ఆర్అండ్‌బీ అధికారులు సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

వేగం పెంచిన యువత..

ముఖ్యంగా యువత వేగం పెంచడంతో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అంతే కాకుండా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు ప్రధాన మూల మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు మలుపును గమనించలేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ డివిజన్ పరిధిలో 2023-24 సంవత్సరం వ్యవధిలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్ మండలాల పరిధిలో 66 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 40 మంది మృతి చెందారు. అధికంగా లింగంపేట్ మండలంలో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఆర్అండ్‌బి అధికారులు కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి కేకేవై రోడ్డు మూలమలుపు వద్ద సూచికలు ఏర్పాటు చేశారు. మిగతా అంతర్ గ్రామాలకు వెళ్లే రహదారులకు సూచికలు ఏర్పాటు చేయలేదు. లింగంపేట్ నుంచి బోనాల్, బాయంపల్లి, బాణాపూర్ మీదుగా రాంపూర్, గాంధారి వరకు 28 కిలోమీటర్ల రహదారికి అడుగడుగునా మలుపులున్నాయి. సూచికలు ఏర్పాటు చేయలేదు. గత రెండు నెలల క్రితం బాయింపల్లి, కోర్పోల్ గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద సింగీతం గ్రామానికి చెందిన గ్రామస్తులు కోర్పోల్ గ్రామానికి బంధువుల విందులో పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో మూల మలుపు వద్ద ఆటో బోల్తాపడి ఇద్దరు మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గత నాలుగు నెలల క్రితం లింగంపేట్ నుంచి నల్లమడుగు మీదుగా గాంధారి వెళ్లే రహదారి లింగంపల్లి గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని అక్కడికక్కడే ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. నల్ల మడుగుతాండకు చెందిన గిరిజనుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కొట్టాల నుంచి రాంపూర్, భవానిపేట్, మంబోజిపేట్, కొండాపూర్, సీతయ్యపల్లి, గండిపేట్ వరకు రోడ్డు అటవీ ప్రాంతం గుండా వెళ్లడంతో మలుపులు అధికంగా ఉన్న సూచికలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. పలుసార్లు అధికారులకు సూచించినా.. సూచికలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.





మండలంలో ప్రమాదకరంగా మూలమలుపు రోడ్లు

బోర్డులు చోరీ

గ్రామీణ మారుమూల ప్రాంతాలకు వెళ్లే రహదారుల మూల మలుపుల వద్ద సూచికల బోర్డులు ఏర్పాటు చేసినా దొంగలు ఎత్తుకుపోతున్నారు. రాత్రివేళ బోర్డు లేకుండా చేస్తున్నారు. మూలమలుపుల వద్ద కచ్చితంగా బోర్డులు ఏర్పాటు చేస్తాం.

- ఆర్అండ్‌బి డీఈ నారాయణ, ఎల్లారెడ్డి.

గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం

రోడ్డు భద్రతపై గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. యువత మద్యం సేవించి వాహనం అతివేగంగా నడపవద్దని సూచిస్తున్నాం. మైనర్లు వాహనాలు నడపవద్దు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం రోడ్డు ప్రమాదాల నివారణకు అన్నీ రకాల చర్యలు తీసుకుంటున్నాం. **- డీఎస్పీ శ్రీనివాసులు, ఎల్లారె**

కుళాయిల సమగ్ర సర్వేను సజావుగా చేపట్టాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

గ్రామపంచాయతీలో కుళాయిల సమగ్ర సర్వేను పంచాయతీ కార్యదర్శులు సజావుగా చేపట్టాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం పంచాయతీ కార్యదర్శులకు మిషన్ భగీరథ నీరు అందే సమగ్ర వివరాలను సేకరించే విధానంపై శిక్షణ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి సర్వే వివరాలు సేకరించి వివరాలను మొబైల్ యాప్‌లో నిక్షిప్తం చేయాలని చెప్పారు. సమగ్ర వివరాలను తర్వాత ప్రభుత్వానికి నివేదిస్తామని వెల్లడించారు. మిషన్ భగీరథ పథకంలో ఏర్పాటు చేసిన ఇంటింటా తాగునీటి పరిస్థితిపై సమగ్ర సర్వే చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు సక్రమంగా వస్తుందా, నల్ల కనెక్షన్ ఉందా, ఆ కుటుంబానికి నీరు సరిపోతుందా, కొత్త గృహాలకు తాగునీటి సదుపాయం ఉంది. లేనిది వంటి విషయాలు తెలుసుకోవడానికి ప్రభుత్వం ఇంటింటా సమగ్ర సర్వేను నిర్వహిస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను తెలుసుకునేందుకు కృషి చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకోవడానికి పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి కార్యకర్తలు, ఐకెపి, ఉపాధి హామీ సిబ్బందిని సర్వేలో భాగస్వామ్యం చేయనున్నట్లు వెల్లడించారు. నల్లాల సమాచారాన్ని ప్రత్యేకంగా భగీరథ మొబైల్ యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఆయా గృహాలకు వెళ్లిన సిబ్బంది యజమాని, కుటుంబ సభ్యుల వివరాలు, సెల్‌ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్ నమోదు చేసుకోవాలని చెప్పారు. లబ్ధిదారుడితో కలిపి ఇంటి ఫోటో, కుళాయిల ఫోటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గ్రామాల వారిగా సేకరించిన సమాచారం మండలాలకు, ఆ తర్వాత జిల్లాకు చేరుతుందని వెల్లడించారు. వివరాలు మొత్తం క్రోడీకరించిన తర్వాత అన్ని ఇళ్లలోని కుళాయిలకు నీటి సరఫరా ఏ విధంగా చేయాలనేది ప్రభుత్వ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

మేనూర్ ఫర్టిలైజర్ దుకాణంలో చోరి

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని మేనూరు గ్రామంలో కిసాన్ ఫర్టిలైజర్ షాపులో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ సోమవారం ఉదయం దొంగతనానికి గురైన కిసాన్ ఫర్టిలైజర్ షాపును పరిశీలించారు. షాపు వెనుక భాగం షెటర్ నుంచి పైనగల రేకును తొలగించి దుకాణంలోకి దుండగులు చొరబడినట్టు గుర్తించారు. జరిగిన దొంగతనంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీనివాస కళ్యాణోత్సవం

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని బాలాజీ మందిర 19వ వార్షికోత్సవ సందర్భంగా శ్రీనివాస కళ్యాణోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు హంపీ పీఠాధిపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి చిన్న మందిరం, దేవాలయం ఒక స్ఫూర్తి కేంద్రం కావాలని, సమాజ సేవనే ఉత్తమ సేవ అని అన్నారు. అవసరమున్న వారికి సహాయం ఉత్తమ సహాయం అని చెప్పారు. మానవులతోపాటు పశువులకు, పక్షాదులకు, సేవచేయాలి అని సూచించారు. అనంతరం మహా అన్నదాన ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

ఆలయాల్లో అభిషేకం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో గ్రామ దేవతలకు పాలాభిషేకం నిర్వహించారు. అలాగే నడిమి హనుమాన్ ఆలయంలో అభిషేకాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అలాగే పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు, వ్యాపారులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మోడీ ప్రమాణ స్వీకారం.. పలుచోట్ల సంబురాలు

నవతెలంగాణ-మద్నూర్,పోతంగల్

భారతదేశ ప్రధానమంత్రిగా మూడోసారి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టడం.. దేశ ప్రధానిగా మోడీ ప్రమాణ స్వీకారం చేయడంతో మండల కేంద్రంలో ఆదివారం రాత్రి బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. గాంధీ చౌక్ ఆవరణంలో టపాకాయలు కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ.. భారత దేశంలో ప్రజా సంక్షేమంతో అభివృద్ధిని ముందుకు తీసుకు వెళ్లడం మూడోసారి దేశ ప్రధాని కావడానికి ప్రజలు బిజెపి సంకీర్ణ ప్రభుత్వానికి అధికారాన్ని అందించడం నాయకులంతా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు తుకారాం నాయకులు కాలే, కృష్ణ పటేల్, యాదవ రావు, సంతోష్, మండల శాఖ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోతంగల్ : నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకార ఉత్సవ కార్యక్రమం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో యువకులు సంబరాలు జరుపుకున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని అంబేద్కర్‌నగర్ పాఠశాలను ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్, ఎంఈఓ గణేష్ రావు సోమవారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈనెల 12న పాఠశాలల పున్ణ ప్రారంభంలోపు పనులను పూర్తి చేయాలని వారు అన్నారు. వారి వెంట పిఆర్ ఏఈ వినయ్ కుమార్, స్థానిక నాయకుడు వసంత్ కాంబ్లే తదితరులు పాల్గొన్నారు.

నీరు వృథా కాకుండా చర్యలు

- డ్రయినేజీలు శుభ్రం
- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో తాగునీటి కులాయికి పైపును బిగించి నల్లాను ఏర్పాటు చేశారు. అలాగే మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించారు. మంగల్‌పాడ్ గ్రామంలో కులాయి లేక నీరు వృథాగా పోతుండటం.. మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారంపై అధికారులు పట్టించుకోకపోవడంతో తాగునీరు వృథా అనే శీర్షికన నవతెలంగాణలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీంతో గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి (రాములు) స్పందించి వృథాగా పోతున్న కులాయి వద్ద నల్లాను బిగింపజేశారు. అలాగే మురికి కాలువలను శుభ్రం చేయించారు.



కుళాయి ఏర్పాటు చేయిస్తున్న జీపీ కార్యదర్శి

పశువుల అక్రమ రవాణా జరగకుండా
గట్టి నిఘా ఏర్పాటు చేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్

పశువుల అక్రమ రవాణా జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. ఈ నెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా జంతు సంక్షేమం, గోవధ నిషేధం చట్టం 1977 అమలుపై పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సంబంధిత పశువుల డాక్టర్ ధ్రువీకరణ లేనిదే ఆవులను తరలించడం నిషేధమన్నారు. పశు సంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఎక్కడపడితే అక్కడ పశువులను విధించకుండా చూడాలన్నారు. చెక్‌పోస్ట్‌ల నిఘా ఏర్పాటు చేయాలని, రవాణాలో ఆవులను, లేగ దూడలను గుర్తిస్తే మున్సిపల్ సిబ్బందికి అప్పజెప్పాలని, పశువులను అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. పశువులను తరలించే వాహనాలలో పశువులకు సరిపడా స్థలం ఉందో లేదో గుర్తించాలని, ప్రత్యేక పర్మిట్ ఉన్న వాహనాలను మాత్రమే అనుమతించాలని తెలిపారు. రామేశ్వర్లపల్లిలో అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం ప్రారంభమైందని, కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయడం ఒక్క మునిసిపల్ శాఖ పనికాదని, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు, వ్యాపార సంస్థలు, పెంపుడు జంతువుల ప్రేమికులు శస్త్ర చికిత్సలు చేయడానికి ముందుకువచ్చి విరాళాలందించాలన్నారు. భూమిపై జీవించే హక్కు ప్రతి ప్రాణికి ఉందని, స్కూళ్లలో విద్యార్థిని విద్యార్థులకు జంతువుల మీద పక్షుల మీద జాలి, దయ, కరుణ చూపే విధంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఉన్న 30 పశు వైద్య కేంద్ర భవనాలకు చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేపట్టి రంగులు వేయాలని, పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటాలన్నారు. రైతులు పంట పొలాలలో అజోల్లా కల్చర్‌పై అవగాహన కలిగించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పశు సంవర్ధక అధికారి సింహరావు, పశువైద్య సహాయ సంచాలకు రోహిత్ రెడ్డి, భాస్కరన్, అటవీ, వాణిజ్య, రవాణా, విద్యాశాఖ ప్రతినిధులు రమేష్, గంగాధర్, శ్రీనివాస్, ఉమారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

- సిఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్
- జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఎడపల్లి/జుక్కల్



ఎడపల్లి : ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు



జుక్కల్ : ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో పారిశుధ్య కార్మికులకు సుమారు 6 నుంచి 8నెలల వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. సిఐటియు పిలుపులో భాగంగా ఎడపల్లి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులతో పాటు జానకంపేట, అంబలో(వై), గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల చేపట్టిన నిరసనకు హాజరై మాట్లాడారు. పొద్దున లేచి సాయంత్రం వరకు గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ప్రభుత్వాలు మారినా పారిశుధ్య కార్మికుల తలరాతలు మారడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీలో చాలామంది నిరుపేదలు సఫాయి కూలీగా పని చేస్తున్నప్పటికీ వారికి రావాల్సిన బకాయి ప్రభుత్వం చెల్లించకపోవడం సిగ్గుచేటని అన్నారు. నెల రాగానే గ్రామపంచాయతీ కార్మికులు అధికారులకు జీతాలు ఇవ్వాలని అడిగితే ఇష్టముంటే పని చేయండి లేదంటే మానుకోండి అని బెదిరిస్తున్నారని ఆమె విమర్శించారు. పారిశుధ్య కార్మికులకు కనీసం ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం ప్రభుత్వం కల్పించకపోవడం బాధాకర విషయమని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని గ్రామ పంచాయతీ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు జొక్కరి పద్మ స్వామి, బూడిది గంగామణి, బాలమణి, అనిత, లక్ష్మణ్, పెద్ద గంగాధర్, ఎల్లయ్య, బూడిది రాజు, అఫ్రోజ్‌ఖాన్, లక్ష్మణ్, నాగరాజు, సాయిలు, గంగారాం, ఆయా గ్రామాల గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు ఇవ్వాలి..

జుక్కల్ : గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జుక్కల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులకు గత 8 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని అన్నారు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 51జీవో సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు ఇన్సూరెన్స్ చేయాలని, పాత కేటగిరీల విధానాన్ని కొనసాగించాలని, కారోబార్, బిల్ కలెక్టర్ల ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని, జీవో నెంబర్ 60 ప్రకారం పంచాయతీ ఉద్యోగులకు వేతనాల అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్షులు గోవింద్, కార్మికులు ఈరయ్య, గంగారాం, సాయిలు, మారుతీ, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.